క్లుప్తంగా

పొందూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉదయలక్ష్మి



పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సి.హెచ్.ఉదయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మికి సిబ్బంది, విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు.

గుణాత్మక విద్య అందించాలి



విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

జలుమూరు: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ ఆర్.వి.ఎస్.ప్రసాద్ అన్నారు. లింగాలవలస పంచాయతీ హరికృష్ణమ్మపేటలో ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు అడిగి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణతపై సూచనలు చేశారు. సిబ్బంది, విద్యార్థులున్నారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవాలకు అలంకరించిన స్వామివారి మూలవిరాట్

సారవకోట: ఈ నెల 22వ తేదీ నుంచి వడ్డినవలస గ్రామంలోని త్రినాథ స్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. శుక్రవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం, త్రినాథ స్వామి ఉత్సవ విగ్రహాల తిరువీధి నిర్వహిస్తామన్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు ఉంటాయన్నారు. ఆలయంలో కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మండలంలోని పల్లిపేట గ్రామంలో నూతనంగా నిర్మితమైన వెంకటేశ్వరలక్ష్మీదేవి సమేత కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ నాయకులతో కలిసి తొలి దర్శనం చేశారు. ఆలయాన్ని నిర్మాణం చేపట్టిన దాతలకు ఈ సందర్భంగా అభినందించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, మండల నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామం ప్రధాన రహదారిపై స్థానిక ఎస్‌ఐ జి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఆమదాలవలస–పాలకొండ రోడ్డులోని మదనాపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నరసన్నపేట సీఐ ప్రసాదరావు, సారవకోట ఎస్‌ఐ అప్పారావు బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు, ర్యాంప్ తదితర విషయాలను తనిఖీ చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

సరుబుజ్జిలి: ప్రతిఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్థానిక తహసీల్దార్ జె.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని అలమాజీపేట, సీతారామ్‌నగర్ కాలనీల్లో ఉపాధి హామీ వేతనదారులకు ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. నగదు, మద్యం, రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

ఓటు విలువ తెలుసుకో..

నరసన్నపేట: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటును అమ్ముకోవద్దు, ఓటుతో నచ్చిన వ్యక్తిని ఎన్నుకోవాలని ప్రచారం చేస్తూ స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్యవరంలో ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. గతమూడు రోజులుగా సత్యవరంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. జమ్ములో జ్ఞానజ్యోతి కళాశాల విద్యార్థులు కూడా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



సారవకోట: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి..

కొత్తూరు: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఓ జనార్దనరావు కోరారు. మండలంలోని పారాపురంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మహిళా సంఘాల సభ్యులు మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఓలు, సీసీలు సీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

సారవకోట: మండల కేంద్రంలో తహసీల్దార్ భాగ్యవతి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై బుధవారం అవగాహన కల్పించారు. నీ ఓటు.. నీ భవిష్యత్ అని ప్లకార్డులను జాతీయ రహదారిపై ప్రదర్శిస్తూ ఓటు హక్కుపై అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాంబాబు, డీటీ మధుబాబు, ఆర్ఐ బేగం తదితరులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్



నరసన్నపేట: సత్యవరంలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు



కొత్తూరు: మానవహారంగా ఏర్పడిన మహిళా సంఘాల సభ్యులు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: నియోజకవర్గం నుంచి ఆరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న ధర్మాన కృష్ణదాస్‌కు ఉర్లాం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మీ వెంటే ఉంటాం, మీ గెలుపే మా లక్ష్యం, జగనన్న సీఎంను చేయడానికి, నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్‌ను ఎమ్మెల్యే చేయడానికి కృషి చేస్తామని ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు అన్నారు. నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు నాయకులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు బార్ల వేణుగోపాలరావు, గుప్త, అప్పన్న, యాబాజి రమేష్, పోలాకి రమణయ్య, సతివాడ రామినాయుడు, పి.కృష్ణారావు, దుల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయండి



హిరమండలం బూత్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

● ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మనమంతా జగనన్న కోసం సైనికుల్లా పనిచేద్దాం.. పాతపట్నంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హిరమండలం మండలానికి చెందిన బూత్ కమిటీ సభ్యులతో మేం సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బూత్ స్థాయిలో ప్రతి లబ్ధిదారుడిని కలిసి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు సుదీర్ఘంగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి, నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ, వి.చిన్నారావు, బెవర గంగాధరరావు, మీసాల రామారావు, మురళి, చిరంజీవి, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



నరసన్నపేట: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఎల్.ఎన్.పేట: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని నడగాంలో సీతారాముల కల్యాణం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించా. ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లుకలాం రవి, గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. నడగాంతోపాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోదండరాముని పుష్కర బ్రహ్మోత్సవం

ఎల్.ఎన్.పేట: మండలంలోని చింతలబడవంజ గ్రామంలో కోదండరాముని పుష్కర బ్రహ్మోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పుష్కర బ్రహ్మోత్సవాలను నిర్వహించామని ఆలయ ధర్మకర్త అన్నెపు లోహితుడు, కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

మండల సమావేశం రేపు

సారవకోట: ఈ నెల 22వ తేదీన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాంబాబు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

రేపటి నుంచి డోలోత్సవాలు

హిరమండలం: సుభలయ గ్రామ సమీపంలోని తపోగిరిపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో డోలోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం అర్ధ రాత్రి కామదహనంతో ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం మూలవిరాట్ విగ్రహం నిజరూప దర్శనం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణం, సాయంత్రం స్వామివారి తిరువీధి మహోత్సవం, సోమవారం స్వామివారి చక్రతీర్థ స్నానాలు, డోలాయనం, పంచాంగ శ్రవణంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్షరాస్యతపై అవగాహన

కొత్తూరు: ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పుడే ఆ కుటుంబం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని శ్రీవెంకటేశ్వర విద్యా సంస్థల డైరెక్టర్ జి.కృష్ణారావు అన్నారు. మండలంలోని గురండి, పాతపాడు గ్రామాల్లో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటు చేశారు. అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అప్పారావు

పాతపట్నం: నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పాతపట్నం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అప్పారావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం రానున్న ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు చేయాల్సిన, చేయకూడని అంశాలను వివరించారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంక్ ఖాతాలను ప్రారంభించి, ప్రతీ ఖర్చును రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలపై అధికారికంగా షోడా రిజిస్టర్‌ను కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తదితర వాటికి ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాలన్నారు. నామినేషన్ ముగిసేంతవరకు వ్యయ పరిశీలన బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

23న మండల సమావేశం

బూర్జ: ఈ నెల 23వ తేదీన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు బుధవారం తెలియజేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



పాతపట్నం: తెంబూరులో సచివాలయ ఉద్యోగులకు సూచనలిన్న ఎంపీడీఓ రామకృష్ణరాజు



కొత్తూరు: కొత్తూరు సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

పాతపట్నం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు స్పష్టం చేశారు. మండలంలోని గంగువాడ, తెంబూరు, పెద్దలోగిడి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో బుధవారం సచివాలయ ఉద్యోగులతో కలిసి పర్యటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనుమతులు తప్పనిసరి

సరుబుజ్జిలి: ఎన్నికల ప్రచారంలో పాల్గొనే రాజకీయ పార్టీల నేతలు ఆమదాలవలస నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ (జిల్లా జాయింట్ కలెక్టర్) అధికారి నుంచి ఆన్‌లైన్, వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు బుధవారం వెల్లడించారు. ప్రచార సమయంలో వినియోగించే వాహనాలు, లౌడ్ స్పీకర్లు, కరపత్రాల పంపిణీ, జెండాలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, ర్యాలీలకు సంబంధించిన అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని లబ్బ, కొత్తూరుతోపాటు పలు సచివాలయాలను బుధవారం సందర్శించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. ఎన్నికలకు అవసరమైన వివరాలు ఎప్పటికప్పుడు అధికారులకు నివేదించాలన్నారు.

అకాల వర్షంతో అవస్థలు



హిరమండలం: వర్షానికి తడిచిన అపరాల పంటను చూపిస్తున్న రైతు



జలుమూరు: మొక్కజొన్న పంటపై కప్పిన టార్పాలిన్లు



బూర్జ: ఇటుక బట్టీలపై కప్పిన టార్పాలిన్లు

జలుమూరు: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో వర్షాలు కురవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. బుధవారం వర్ష ప్రభావం కాస్తా ఎక్కువైంది. వరి, వేరుశెనగ, మొక్కజొన్న పంటలను రైతులు ప్రస్తుతం ఇంటికి చేర్చుతున్నారు. శ్రీముఖలింగం, అచ్యుతాపురం, నగిరికటకం, గొటివాడ, పాగోడు గ్రామాల్లో ఇప్పటికే పలు పంటలు ఎండబెట్టేందుకు రోడ్లపై నిల్వ చేశారు. వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచారు.

ఇటుక బట్టీలపై..

బూర్జ: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని కొల్లివలస దగ్గర ఇటుక బట్టీలు తడవకుండా టార్పాన్లను యజమానులు కప్పి ఉంచారు. యజమానులు అవస్థలు పడ్డారు.

అపరాల పంటకు నష్టం

హిరమండలం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున జల్లులు కురిశాయి. ప్రసుతం కురుస్తున్న వర్షాలు కొంత మోదాన్ని, కొంత ఖేదాన్ని కలిగించాయి. రబీలో సాగు చేసిన నువ్వు, వరి, అపరాలు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సీఎం జగన్‌తో సుపరిపాలన



జలుమూరు: ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: ప్రయాణికులతో మాట్లాడుతున్న రెడ్డి శ్రావణ్

పాతపట్నం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని, మళ్లీ సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి శ్రావణ్ కుమార్, రెడ్డి ఓం శ్రీకృష్ణ అన్నారు. బుధవారం ఉదయం పాతపట్నం బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులతో కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మద్దతుగా నిలవాలని కోరారు. గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు టి.సుధ, ఎం.వరధరాజులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు మేం సిద్ధం..

జలుమూరు: మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, నరసన్నపేట ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ వాన గోపి అన్నారు. గొటివాడలో బుధవారం మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, పోతయ్య, శిమ్మ నాగేశ్వరరావు, మొయ్యి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పోరాటయోధుడు అప్పలసూరి

● నేడు కోమర్తిలో 27వ వర్ధంతి





కోమర్తిలో అమరవీరుల స్థూపం (ఇన్‌సెట్లో) మామిడి అప్పలసూరి(ఫైల్)

నరసన్నపేట: అణగారిన ప్రజలకు అండగా ఉంటూ దోపిడీ, పీడనలు లేని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి తుదిశ్వాస వరకూ పోరాడిన అమరవీరుల్లో మామిడి అప్పలసూరి ఒకరు. విలువలు, త్యాగాలు, నిబద్ధతకు నిదర్శనంగా నడుచుకుంటూ అటు గిరిజన ప్రాంతంలో ఇటు మైదాన ప్రాంతంలోనూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి వారికి అండగా ఉంటూ వచ్చారు. గ్రామాల్లో పాలర్ల సంఘాలు పెట్టి వారికి న్యాయం జరిగేలా ముందుకు కదిలారు. భూమి లేని ప్రజలకు భూ హక్కులు కల్పించేందుకు అనేక గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో భూ పోరాటాలు నిర్వహించారు. భూ హక్కులు కల్పించారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాయతీ కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి వంటి అమర వీరులతో కలిసి పనిచేశారు. అజ్ఞాతంలో ఉంటూనే అనారోగ్యానికి గురై సరైన వైద్య సదుపాయాలు అందక 1997 మార్చి 21న అప్పలసూరి మృతి చెందారు. ఆయన స్మృతి చిహ్నంగా కోమర్తిలో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూపాన్ని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటి నుంచి ఏటా మార్చి 21న సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో అశువులు బాసిన అమర వీరులకు, ఉద్యమాల బాటకు సహకరించి ప్రాణాలు వదిలిన గుమ్మడి లచ్చయ్య, మామిడి లచ్చెమ్మలకూ ఈ సందర్భంగా నివాళులు అర్పించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కోమర్తి అమర వీరుల స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ తెలిపారు. ప్రధాన వక్తగా ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, అరుణోదయా సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.